# సత్యపాలన

"నిన్ను కూడా రాజకీయాల్లోకి తీసుకొస్తున్నాం" రాజశేఖరం అన్నాడు.

"తండ్రీ కొడుకులు ఉద్ధరిస్తోన్నది చాలదనా మళ్ళీ నన్ను దింపటం" నవ్వుతూ కొట్టిపారేసింది సత్య.

"సరదా కనటంలేదు సత్యా–నిజం. మన మున్సిపాలిటీని మహిళలకి రిజర్వు చేశారు కదా. మన పార్టీ సీటు నీకొచ్చేలా ప్రయత్నాలు ప్రారంభించారు నాన్నగారు"

విస్మయంగా అపనమ్మకంగా చూసింది.

"నువ్వేం భయపడొద్దు. వెనుక ముగ్గులు పెట్టడానికి మేమున్నాం కదా"

"అహ అందుక్కాదు.."

"మరేమిటి? గెలుపు గురించా? నాన్నగారి పలుకుబడి నిన్ను ఈజీగా గెలిపించేస్తుందిగాని ఈ అప్లికేషన్ మీద సంతకం పెట్టు"

అందుకుని చూసింది.

పార్టీ టిక్కెట్టు ఇమ్మని పార్టీ అధ్యక్షుడికి రాసిన దరఖాస్తు.

బయోడేటా వివరాలు కూడా ఇవ్వబడ్డాయి. ఆత్రంగా చదివింది.

ఫస్టు క్లాసుతో డిగ్రీ పాసయ్యిందిట. కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ లీడర్‌గా ఎన్నో సాధించిందట. మరెన్నో బహుమతులు ప్రశంసలు అందుకుందిట. చంద్రావుగారి కోడలయ్యాక పార్టీ నగర మహిళా విభాగంలో ప్రముఖ పాత్ర వహించిందిట. ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల మెప్పు పొందిందిట. సారా నిషేధోద్యమానికి నాయకత్వం వహించిందిట.

భర్త వంక ఆశ్చర్యంగా చూసింది. ఎందుకంటే పెళ్ళికి ముందు రాసినవన్నీ నిజాలు. పెళ్ళయ్యాక పేర్కొన్న వన్నీ అబద్ధాలు.

ఒక స్నేహితురాలీమధ్య అన్నట్టు పెళ్ళయ్యాక తను ఇంటికీ భర్తకీ పిల్లలకీ చీరలకీ నగలకీ సినిమాలకీ పేరంటానికీ పరిమితమైపోయింది!

నవ్వేదతడు.

"ఆ రాతల గురించేం పట్టించుకోకు. రాజకీయాల్లో ఆమాత్రం షో చెయ్యాలి. అయినా ఇవి చూసే టిక్కెట్టివ్వరు. చాలా పైరవీలు గట్రా చెయ్యాలి. అవన్నీ నాన్నగారు చూసుకుంటార్లే"

సంతకం పెట్టించుకునెళ్ళిపోయాడు రాజశేఖరం.

శిలా ప్రతిమలా కూర్చుండిపోయింది సత్య.

ఇదంతా నిజమని నమ్మబుద్ధి కావడం లేదు. తను రాజకీయాల్లో ప్రవేశించడమన్న ఊహే ఎంతో వింతగా తమాషాగా అన్పిస్తోంది. అదే సమయంలో ఎంతో ఆనందంగా పట్టరానంత సంబరంగానూ వుంది.

కాలేజీ రోజులు గుర్తొచ్చాయి.

ప్రతి ఏడాదీ ఏదో ఒక పదవి చేబట్టేది. ఫైనల్ ఇయర్లో స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైంది. కాలేజీ కమిటీతో ప్రిన్సిపాల్తో పోట్లాడి ఎన్నో పనులు చేయించింది. విద్యార్థినులకు వెయిటింగు రూము, సైకిలు స్టాండు ఏర్పాటు చేయించింది. లైబ్రరీకి పుస్తకాలు తెప్పించింది. సైన్సు లేబరేటరీకి ఎక్విప్‌మెంట్ తెప్పించేందుకు కృషి చేసింది. సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించింది. ప్రముఖుల్ని పిలిచి గోష్ఠుల్ని ఏర్పాటు చేసింది. ఒకసారి సమ్మె కూడా చేయించింది.

తనో చక్కని నాయకురాలని ఎన్నోసార్లు ఋజువు చేసుకుంది.

ఇప్పుడేకంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నగర ప్రథమ పౌరురాలిగా...!

ఉప్పెనలా పొంగివచ్చిన ఉత్సాహానికి వుబ్బి తబ్బిబ్బయ్యింది. సంతోషాన్ని ఎవరో ఒకర్తో పంచుకోవాలన్పించింది. పరుగునెళ్ళి అత్తగార్తో చెప్పింది.

"అయితే ఇహనుంచి నువ్వు కూడా ఇల్లు పట్టకుండా తిరుగుతావన్నమాట. ఇంటిపనంతా నా నెత్తిన పడుతుంది కామోసు!"

హతాశురాలయ్యింది సత్య. ఆవిడ ధోరణి అంతేలే అని సరిపెట్టుకుంటూ హాల్లోకి నడిచింది.

చంద్రావు గురించొచ్చారో ముగ్గురు. సత్యని చూసి దణ్ణం పెట్టారు. కొత్త పరిణామానికి తడబడింది. అప్పుడే వార్తకి రెక్కలొచ్చాయనుకుంటూ ప్రతి నమస్కారం చేసింది. వాళ్ళకి సమాధానం చెప్పి పంపి పుట్టింటికి ఫోన్ చేసింది.

"మంచిదేగాని మీ మావగారెలా చెబితే అలా నడుచుకో" అన్నాడు తండ్రి.

"నువ్వేమైనా సాధించగలవే" అంటూ అభినందించింది తల్లి.

మర్నాటి పేపర్లలో అధికార పార్టీ టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తున్నవారి జాబితాలో సత్య పేరు కూడా చేర్చి వార్తలొచ్చాయి. ఎవరెవరికి సీటు దక్కే అవకాశాలున్నాయో కూడా రాశాయి.

ప్రముఖ సంఘ సేవికా ఓ మంత్రిగారికి దూరపు బంధువూ అయిన రాజేశ్వరికి సీటు వచ్చే అవకాశాలెక్కువగా వున్నట్టు రాశాయి. కులపు ఓట్ల దృష్ట్యా చూస్తే మాత్రం వరలక్ష్మికి ఇవ్వొచ్చని వూహాగానం చేశాయి. మాజీ ఎమ్మెల్యే కోడలైనా రాజకీయానుభవం లేనందున సత్యకి సీటు రాకపోవచ్చని పేర్కొన్నాయి.

అయినా సత్య నిరుత్సాహపడలేదు. మావగారి 'పట్లు' గురించామెకి బాగా తెలుసు. పైగా ఒకసారి మున్సిపల్ చైర్మన్‌గా మరోసారి ఎమ్మెల్యేగా పనిచేశారాయన. క్రితంసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా పై వర్గాల్లో పలుకుబడి తగ్గలేదు. ఎలాగైనా టిక్కెట్టు సాధించుకురాగల సమర్థులనుకుంది.

నాలుగో రోజున మీసం మెలేస్తూ వచ్చారు చంచ్రావు.

జయజయ నినాదాలు మార్మోగాయొక్కసారే.

థ్రిల్లింగ్‌గా ఫీలయ్యింది సత్య. ఏదో తెలీని ఎక్సైట్‌మెంట్ చుట్టేసిందామెని.

తను చైర్‌పర్సన్ అయిపోయినట్టే అన్పించింది.

కళ్ళ ముందు టౌన్ పరిస్థితి, సమస్యలు కదిలాయి.

రైల్వే స్టేషన్ కెళ్ళే దారి కిరుప్రక్కలా వున్న లేబర్ గుడిసెలూ ఆ గుడిసెవాసుల బతుకులూ గుర్తొచ్చాయి. అశుభ్రంగావున్న పంట కాలువ నీళ్ళు త్రాగే బలహీన వర్గాలవారు గుర్తొచ్చారు. నానా ఖంగాళీగా వుండే గోదావరి గట్టు మనస్సులో మెదిలింది. శుద్ధి చెయ్యని పంపునీళ్ళ త్రాగి జనం అమీబియాసిస్ పాలిట పడుతున్న సంగతి గుర్తొచ్చింది. కాస్త వర్షానికే మునిగే రోడ్లు పుస్తకాల్లేని లైబ్రరీ మొక్కల్లేని పార్కు పాఠాలు చెప్పని స్కూళ్ళూ గోతుల రోడ్లు రోడ్డు మీదకి చొచ్చుకొచ్చిన బిల్డింగులు అక్రమ ఆక్రమణలు అవినీతి... అన్నీ గుర్తొచ్చాయి.

ఏదో చెయ్యాలి మరేదే సాధించాలన్న తపన వూపిరి పోసుకుందామెలో.

నామినేషన్ దాఖలు చెయ్యడం కౌన్సిలర్లని సెలక్ట్ చెయ్యడం కరపత్రాలు బానర్లు జండాలు సిద్ధపరచడం – గబగబా జరిగిపోయాయి.

ప్రచారానికి బయల్దేరుతూ సత్యని కూడా రమ్మనారు. దణ్ణంపెట్టి ఓట్లడిగితే చాలన్నారు. ఆమెకి ప్రేక్షక పాత్ర ఇచ్చి వ్యవహారాలన్నీ చంచ్రావు రాజశేఖరం పార్టీవారు చూస్తున్నారు.

ఒక కాలనీలో ఏర్పాటు చేసిన ప్రచార సభలో పాల్గొన్నారంతా.

స్థానికులు తమ సమస్యల్ని ఏకరువుపెట్టారు.

అన్నీ తీర్చేస్తామంటూ వాగ్దానం చేశారు చంద్రరావు.

"ఇది వరకూ ఇలాగే చెప్పేరు" అన్న వ్యాఖ్యానాలు విన్పించాయి. వారి మీదపడి కరిచినంత పని చేసి నోర్మూయించారు కొందరు కార్యకర్తలు. సభముగించెయ్యబోతోంటే సత్యని మాట్లాడమన్నారు కొందరు మహిళలు.

"సత్యాదేవి అందర్లాటి వారు కాదు. చేసే పనుల్ని మాటల్లో చెప్పరు. ఆచరణలో చూపిస్తారు." అని సర్దిచెప్పబోయాడు స్థానిక నాయకుడు. ఆమె ఉపన్యసించలేదని అతడి నమ్మకం. కాని ఆవేశంతో సన్నగా వూగిపోతూ మైకు అందుకుంది సత్య.

మళ్ళీ కాలేజీ డేస్ నాటి సత్యగా మారిపోయిందామె. వారి సమస్యల్ని విశ్లేషించింది. కారణాలూ పరిష్కార మార్గాలూ చెప్పింది. అన్నీ చక్కదిద్దుతానని హామీ ఇచ్చింది.

పది నిమిషాలపాటు ఆగకుండా మ్రోగాయి తప్పట్లు.

చంద్రరావుతోసహా అంతా విస్తుబోయారామె వాక్ప్రవాహానికి.

ఆ పిమ్మట ఏ సభలోనూ చంద్రరావు రెండు నిమిషాలకన్నా ఎక్కువ మాట్లాడలేదు. అసలాయన వచ్చారో లేదో కూడా ఎవరూ పట్టించుకోలేదు.

అన్నిచోట్లా సత్య. అందరి నోళ్ళలోనూ సత్య.

ఆమెలో జనావళికి కొత్త నాయకురాలు కన్పించింది. ఆమె అందర్లాంటిది కాదన్న నమ్మకం కుదిరింది. తమకీ తమ వూరికీ ఏదో చేస్తుందని మనస్ఫూర్తిగా విశ్వసించారు. బ్రహ్మరథం పట్టారు.

అత్యధిక మోజార్టీతో గెలుపొందింది సత్య.

అప్పుడు జరిగిన విజయోత్సవ సభచూసి ఆమె రాష్ట్రస్థాయి కెదిగిపోవడం ఖాయం అనుకున్నారు చంద్రరావు. ఆ ఉత్తర క్షణాన తనకిక రాజకీయ గ్రహణం పట్టేసినట్టే అనీ అనుకున్నారు. అసూయతో మండారు. మూల్గారు. అన్నీ దిగమ్రింగి 'నా కోడలి పదవి నా పదవే కదా' అనుకుని ముఖానికి చిరునవ్వు పులుముకున్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి సత్య వెంట వెళ్లేడు రాజశేఖరం. ఆమె కేవలం తన డమ్మీ అన్నట్టుగా వ్యవహరించాడు. అధికారులకీ సిబ్బందికీ ఆజ్ఞలిచ్చాడు.

కౌన్సిల్ ప్రథమ సమావేశానిక్కూడా వెళ్ళి కూర్చున్నాడు. ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు.

"నా భార్యకి సహాయంగా వచ్చేను" అని భీష్మించుకుని కూర్చున్నాడు.

అతడి ప్రవర్తన చాలా ఇబ్బందిగా అన్పించింది సత్యకి. ప్రతిపక్ష సభ్యులు గోల చెయ్యడంతో అతడ్ని బయటికెళ్ళి పొమ్మనక తప్పలేదు. అతడు బుసలు కొడ్తూ వెళ్ళేడు. కొందరు నవ్వేరు. అవమానంగా ఫీలయ్యిందామె. మరీ అంత సంస్కార హీనంగా ప్రవర్తిస్తున్నాడేమిటని భర్తమీద లోలోన విసుక్కుంది.

నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తూ అందరి సహాయ సహకారాలనీ అభ్యర్థించింది సత్య.

అనంతరం జరిగిన పత్రికా సమావేశంలో అవినీతిలేని పాలనని అందిస్తాననీ పట్టణాభివృద్ధికి నిస్వార్థంగా కృషిచేస్తాననీ ప్రకటించింది.

తన ఛాంబర్లో కెళ్ళిన సత్య తన సీట్లో కూర్చుని సిగరెట్ కాలుస్తున్న భర్తని చూసి విస్తుబోయింది.

"అది ఛైర్‌పర్సన్ కోసం నిర్దేశించిన కుర్చీ. మీరందులో కూర్చోకూడదు. ఎవరైనా చూస్తే బావుండదు"

"మనలో మనకేవిటోయ్"

"మనమైనా మరొకరైనా ఎవరి స్థానాల్లో వాళ్ళుంటే మంచిది"

"ఏవిటోయ్ పత్తిత్తు కబుర్లు చెబుతున్నావ్. నిన్నీ స్థానానికి తీసుకొచ్చి కూర్చోబెట్టింది మేమని మర్చిపోకు"

"ప్లీజ్. కాస్త అర్థం చేసుకుని డిగ్నిఫైడ్‌గా వ్యవహరించండి. నేనిపుడు పబ్లిక్ ఫిగర్ని"

ఆమె ముఖంలోకి చూశాడు. గర్వం లేశమాత్రమూ కన్పించలేదు.

"సరే అయితే. ఇలాటి కుర్చీయే ఇంకోటి తెప్పించి నీ పక్కనే వేయించు"

అలా చెయ్యక తప్పలేదామెకి.

మరుసటి రోజున మున్సిపల్ కమీషనర్నీ సెక్షన్ హెడ్స్‌నీ ఇతర అధికారుల్నీ సమావేశపరిచింది సత్య.

పారిశుధ్యం గురించీ పన్నుల వసూళ్ళ గురించీ అభివృద్ధి కార్యక్రమాల గురించీ అడిగితెలుసుకుంది. అవన్నీ వేగిర పరచాలంటూ కౌన్సిల్ నిర్ణయాలని తెలియజెప్పింది. ఇంటి ప్లాన్లు మంజూరు దగ్గర్నుంచి వాటర్ కనెక్షన్లివ్వడం వరకు టెండర్ల నుంచి కాంట్రాక్టు పనుల వరకు అన్నిట్లోనూ అవినీతిని చొరబడనీయవద్దని గట్టిగా చెప్పింది. తనెలాటి అవినీతినీ సహించననీ ఆరోపణలొస్తే తీవ్ర చర్య తీసుకుంటాననీ హెచ్చరించింది.

ఒక నెల గడిచింది. ఎందులోనూ ఎలాంటి మార్పూ కన్పించలేదు సత్యకి. మరో నెల గడిచింది. తను చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాకముందెలా వుందో అక్షరాలా అలాగే వుంది పరిపాలన. ఊరు కాదు పనులు కాదు ఆఫీసు వ్యవహారాలు కాదు ప్రతిదీ ఇదివరకట్లానే వుంది - ఇదివరకట్లానే సాగుతోంది తప్ప ఎలాంటి మార్పూలేదు. మరెలాంటి ప్రగతీ లేదు. కనీసం చిన్న కుదుపు కూడా రాలేదు.

"మీరాడవాళ్ళు. మీకీ గొడవలు అర్థం కావు మేడం" కమీషనర్ అన్నాడు.

"నంగి నంగిగా మాట్లాడకండి. విషయమేమిటో సూటిగా చెప్పండి" అంటూ నిలదీసింది.

గబుక్కున చేతులు కట్టుకుని అతి వినయం ప్రదర్శించారు.

పనులన్నీ శ్రద్ధగా చక్కగా చేస్తూనే వున్నామన్నారు. ఇంకా వేగంగా చెయ్యడానికి రూల్సు రెగ్యులేషన్లూ పర్మిషన్లూ ఫైళ్ళూ సంతకాలూ తీర్మానాలూ-ఎన్నో అడ్డంకులని ఏకరువు పెట్టారు. తమలోపం ఏమాత్రం లేదని సవినయంగా మనవి చేశారు.

అసహనంతో నిస్పృహతో తల్లడిల్లింది. ఇంకేం చేస్తే ఎలా నడిస్తే తననుకున్నట్టుగా పనులు సాగుతాయో అర్థం కాలేదు. అలాగని చేతకాని దాన్లా చేతులు ముడుచుకుని కూర్చోదలచనూలేదు.

సమర్థుడైన అధికారిగా పేరున్న ఒకాయన్ని పిలిచి తన బాధని వెళ్ళగ్రక్కింది. పరిష్కార మార్గమేదైనా చెప్పమంది.

అతడు అభినందన పూర్వకంగా చూస్తూ అన్నాడు "మీకు కోపం రాదన్న నమ్మకంతో చెబుతున్నాను. అవినీతిని సహించనంటూ మీరు హెచ్చరించేసరికి కమీషనర్ ఆధ్వర్యంలో కొందరు ముఖ్యోద్యోగులు, కాంట్రాక్టర్లు వెళ్ళి మీవారిని కలిశారు. ఇచ్చిపుచుకోవటాల గురించి ఒప్పందం కుదిరింది. అంచేత అంతా నిర్భయంగా యధాప్రకారం చేసుకు పోతున్నారు"

విద్యుద్ఘాతంలా తగిలాయామాటలు. అదిరిపడి చూసింది. అత్యంతాశ్చర్యంగా చూసింది.

తన చాటున తన భర్త తన క్రింది వాళ్ళతో లాలూచీపడి...!

కోపం బుస్సున తన్నుకొచ్చింది.

ఆయనకి థాంక్స్ చెప్పి కారులో ఇంటికొచ్చేసింది.

"నాకు తెలీకుండా మీరు కమీషనర్తో ఒప్పందానికొచ్చారా?" ఉచ్చైస్వరంతో సూటిగా ప్రశ్నించింది.

రాజశేఖరం ముఖం పాలిపోయింది. నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు "రిలాక్స్ సత్యా. ఇది మన ఇల్లు. మీ కౌన్సిల్ మీటింగు హాలు కాదు"

"మాట దాటెయ్యొద్దు. నేనడిగిందానికి సమాధానం చెప్పండి"

"చూడు సత్యా. రాజకీయాల గురించి నీకు ఓనమాలు తెలీవు..."

"రాజకీయాలంటే లంచాల్లో వాటాలు పుచ్చుకోవడమా?"

"సత్యా!"

"అవును. సత్యనే మాట్లాడుతున్నాను. రాజకీయలంటే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అధికారుల్ని ఆకట్టుకుని ప్రజల సొమ్ముని నిలువునా దోచెయ్యటం కాదు..."

సర్రున కోపం వచ్చిందతడికి. "నిన్న గాక మొన్న కళ్ళు తెరిచిన పిల్లకాకివి. మా డాడీ పలుకుబడితో మేం విరజిమ్మిన డబ్బుతో ఎన్నికైన మున్సిపల్ ఛైర్‌పర్సన్‌వి! అప్పుడే స్వంతగొంతుతో మాట్లాడేదాకా వచ్చావన్న మాట. అనల్నీ గురించి నువ్వేమనుకుంటున్నావ్? నువ్వేమైనా ఇందిరాగాంధీననుకుంటున్నావా?"

"ప్రజలకి స్వచ్ఛమైన పాలనని ఇవ్వాలనుకున్నాను. అందుకు భిన్నంగా జరిగితే సహించను" అందామె సహనం నశించి.

"ష్! ఉపన్యాసాలొద్దు. ఊరిని బాగుచేస్తూ కూర్చోడానికి పదవి వూరికేరాలేదు. పార్టీ టిక్కెట్టుకీ ప్రచారానికీ బోల్డు ఖర్చయ్యింది. ఆ పెట్టుబడంతా రాబట్టుకోడానికి కొందరు మున్సిపల్ ఉద్యోగుల్తో కాంట్రాక్టర్లతో ఒప్పందానికొచ్చాం. మనం వాటా తీసుకోకపోయినా వాళ్ళు తినేది తినక మానరని గుర్తుపెట్టుకో. మరింకేం తర్కించక నేను చెప్పినట్టు నడచుకో. అంతకంటే ఎక్కువగా పెత్తనం చెలాయించాలని కలలు గనకు"

"మీ పలుకే పలకడానికి నేనేం చిలుకని కాదు..."

"ఇంకతగ్గు. ఊరికే రెచ్చిపోకు. నువ్వు నా భార్యవనీ నేనాడమన్నట్లల్లా ఆడాల్సిన ఆటబొమ్మవనీ మరిచిపోకు. నేను గీచిన గీటు దాటాలని చూశావో మర్యాద దక్కదు"

"అంటే మీరు వెయ్యమన్న చోట్లల్లా వెయ్యడానికి రబ్బరు స్టాంపునా?"

"అక్షరాలా అంతే. ఏదో నీ సీటు మహిళలకి రిజర్వ్ చెయ్యబట్టి నిన్ను కుర్చీలో కూర్చోబెట్టాం. అంతే మేం చెప్పినట్టు నడుచుకుంటూ పట్టుచీర కట్టుకుని సభలకీ సన్మానాలకీ గెస్ట్‌గా వెళ్ళడమే నీ పని"

"మమ్మల్ని అడ్డం పెట్టుకుని మీరు రాజ్యం ఏలేట్టయితే ఇహ మాకు రిజర్వేషన్లిచ్చి ప్రయోజనమేంటి?"

"అది కంటితుడుపుచర్య. మీ ఓట్ల కోసం విసిరిన మాంసం ముక్క అంతే తప్ప నిజంగా మీ ఆడవాళ్ళకి అధికారం ఇచ్చేసి మేం గాజులు తొడుక్కుని కూర్చుందామని కాదు"

హేళనగా నవ్వుతూ వెళ్ళిపోయాడు రాజశేఖరం.

రోషం ఉక్రోషం దుంఖం ముప్పేటగా పొంగివచ్చాయి. గదిలోకెళ్ళి మంచానికడ్డం పడి బావురుమని ఏడ్చేసింది సత్య.

చాలా బాధగా వుంది. అవమానంగా వుంది. దారుణంగా ఓడిపోయిన భావన నిలువునా నమిలేసింది. కన్నీళ్ళు పొంగి పొంగి వచ్చాయి.

ఆ రాత్రి అన్నం తినేదు.

ఎప్పటికో గదిలో కొచ్చాడు రాజశేఖరం. "సిల్లీగా ఏడ్పులేంటి. పదవిని ఎంజాయ్ చెయ్యడం నేర్చుకో. బీహేపీ. పడుకో" అని చెప్పి గుర్రుపెట్టి నిద్రపోయాడు.

కానామెకి నిద్ర రాలేదు. తనవంక ఆశగా ఆర్తిగా చూస్తోన్న జనమే కళ్ళ ముందు కదుల్తూండిపోయారు!

మర్నాడు కాంట్రాక్టు పనులకి సంబంధించిన కొన్ని పేపర్లు తెచ్చిచ్చాడు. వాటి వంక కన్నెత్తి చూడలేదామె.

అతడెళ్ళి తండ్రికి చెప్పినట్టున్నాడు మావగారు పిలిచారు సత్యని. హాల్లోకెళ్ళి కూర్చుంది. ఆమెనీ ఆమె కళ్ళ నీ ముఖాన్నీ చూశారు చంద్రరావు. ఆమె మనఃస్థితిని అంచనా వేశారు. మెల్లగా గొంతువిప్పారు.

"అబ్బాయి అంతా చెప్పేడు. నీలో జనాన్ని ఆకట్టుకోగల గొప్ప ఆకర్షణశక్తి వుంది. జాగ్రత్తగా మలచుకుంటే గొప్పలీడర్వి అవుతావు. పదవిచేబట్టిన కొత్తలో ఏదేదో చేసెయ్యాలనీ అందరి ప్రశంసలూ పొందెయ్యాలనీ చాలా ఆరాటంగా వుంటుంది. ఆవేశంగానూ వుంటుంది. కాని పనులన్నీ తనొక్కరి వల్లా కావని అందుకెందరి తోడ్పాటో అవసరమనీ గ్రహించడానికి కొంతటైము పడుతుంది. మనం నిమిత్తమాత్రులం అని తెలుస్తుంది.

అప్పుడైనా నలుగుర్తో నారాయణ అంటే ఫర్లేదు. ఎదిరిస్తే అంతా ఏకమై కాళ్ళక్రింది తివాసీ లాగేస్తారు. అందుకనే రాజకీయాల్లో జనాన్నీ పై నాయకుల్నే కాదు మనతో వున్న వాళ్ళనీ మనవాళ్ళనీ ఆకట్టుకుంటూ ముందుకి దూసుకుపోవాలి"

"అందుకే మీరు మాజీ యమ్మెల్యేగా మిగిలిపోయారు" అని మనస్సులో అనుకుని అంది "జనాని కెన్నో చేస్తామని చెప్పి పదవిలోకొచ్చేక పచ్చిస్వార్థంతో..."

ఆమె మాటలు పూర్తికాకుండానే పెద్దగా నవ్వేశారాయన.

"అందుకే ఆడవాళ్ళకి పరిపాలించడం చాతకాదంటాను. మీకు ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. జనం గొర్రెలమంద. వాళ్ళగురించి మళ్ళీ ఎన్నికల ముందాలో చించొచ్చులేగాని ముందు అబ్బాయికేం అడ్డురాకు. చెడ్డపేరొస్తే వాడికే వస్తుందిలే. నిన్నంతా మిస్సెస్ క్లీన్ అనుకుంటారు. అది చాలు మళ్ళీ ఎన్నికవడానికి"

ఆమె మోము ఎర్రబడింది. ఎన్నో ప్రశ్నించాలనుకుంది. కానేమీ అడగలేక లేచింది. అడిగినా ప్రయోజనం వుండదని తెలుసు.

"ఇంకో సంగతి. నువ్వు ఇల్లాలివి. ఇంటిని వదిలేసి రోజూ మున్సిపల్ ఆఫీసుకెళ్ళి రాచకార్యాలేం చక్కబెట్టక్కర్లేదు. కౌన్సిల్ మీటింగులకెళ్తే చాలు. మిగతావి అబ్బాయి చూసుకుంటాడు"

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడింది. రోషంగా చూసింది.

తను చెయిర్‌పర్సన్ కావచ్చు. చేతిలో అధికారం వుండొచ్చు. కాని తనాయన కోడలు. అంచేత ఎన్నైనా అంటారు! అధికారం చెలాయిస్తారు !

విసురుగా లోపలికెళ్ళిపోయింది.

రోజులు మెల్లగా దొర్లుతున్నాయి.

ఆమె ప్రమేయం లేకుండానే అన్నీ జరిగిపోతున్నాయి. అధికారులంతా రాజశేఖరం ఆజ్ఞల్ని స్వీకరిస్తున్నారు. కాంట్రాక్టర్లు అతగాడ్ని మహారాజులా చూస్తున్నారు.

పట్టణపరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే వున్నట్టుంది !

సత్యకెంతో అనీజీగా వుంది. కళ్ళనీళ్ళ పర్యంతంగా వుంది. జనానికి ముఖం చూపించాలంటేనే సిగ్గుగా వుంది.

ఏంచెయ్యాల్లో భర్త వైఖరినెలా మార్చాలో తన బాధ్యతల్నెలా నెరవేర్చాలో తోచక తల్లడిల్లుతోంది!

కాస్త మార్పుగా వుంటుందన్చెప్పి పుట్టింటికెళ్ళింది సత్య.

తండ్రి దగ్గర తనగోడంతా వెళ్ళగక్కింది.

"నువ్వు అతిగా ఆలోచిస్తున్నావమ్మా. అందుకే రాజకీయాలు ధక్కాముక్కీలు తినగల మగాళ్ళకి చెల్లుతాయి గాని సున్నితమైన ఆడవాళ్ళక్కాదు. ఆడవాళ్ళు పాలించలేరు"

"మీరు మరీనూ. ఎందరు ఆడవాళ్ళు మంత్రులుగా ఆఫీసర్లుగా పనిచెయ్యడం లేదు?" అంది తల్లి వెంటనే.

"వాళ్ళకి అండగా తండ్రో భర్తో కొడుకో వుండే వుంటారు. ఆడవారి వెలుగు చంద్రకాంతిలాంటిదే"

"నేనొప్పుకోను. మహామహానాయకుల్ని మట్టి గరిపించలేదా ఇందిరమ్మ? బంగ్లాదేశ్ గొడవల్లో అపరకాళి అన్పించుకోలేదా?"

"నెహ్రూగారి కూతురు గనుక ఆ స్థాయి కెదిగింది. అలాటివాళ్ళు కోటికొక్కరుంటారేమో. అంతే"

"మన సత్య కూడా అలా ఎందుక్కాకూడదు?"

ఉలిక్కిపడ్డారాయన. "నువ్వెక్కడిదానివే. పదవికోసం కాపురాన్ని కాలదన్నమనేట్టున్నావే!"

"అలా ఎందుకనుకోవాలి?"

"చాలు చాల్లే. వాళ్లేదో ముచ్చటగా పదవి కట్టబెట్టారు. వాళ్ళ ముచ్చట తీర్చి మర్యాదగా బయపడితే చాలు. పదవులు శాశ్వతం కాదుకాని ఆడదానికి కాపురం శాశ్వతం"

"మీది మరీ చిత్రం. లోకంలో ఆడవాళ్ళెవరూ పదవులు ఏలటం లేదూ అధికారాలు చెలాయించటం లేదూ అన్నట్టు మాట్లాడతారేవిటి. వాళ్ళందరి సంసారాలూ సజావుగా సాగటం లేదూ? ఎందరో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. వారి వారి మగాళ్ళు వారిని ఉద్యోగధర్మం నిర్వర్తించనివ్వకుండా అడ్డుపడుతున్నారా?"

"భేష్ మమ్మీ. అక్కలాగా మమ్మీ కూడా ఉపన్యాసాలు దంచేస్తోంది." అన్నాడు సత్య తమ్ముడు తప్పట్లు కొట్టి మరీ.

"ప్రజలు నువ్వేదో చేస్తావని ఎన్నుకున్నారు. వారి ఆశల్ని తీర్చడం నీ ధర్మం. నీ బాధ్యత. అందుకు కుటుంబ సంబంధాలు అడ్డురాకుండా చూసుకోవాలి. అలా చూసుకోలేనప్పుడు పదవిని వదులుకుని ఇంటికే పరిమితమైపోవాలి. అంతే తప్ప జనాన్ని మోసం చెయ్యడం మంచిది కాదు" అంది సత్య చెల్లెలు సత్యతో.

తమ్ముడామె మాటల్ని బలపరిచాడు.

"మీ హితబోధ బావుంది. మోసేవాడికే తెలుస్తుంది కాడిబరువు. రాజకీయాల్లోని ఎత్తులూ ఒత్తిళ్ళూ చందాలూ సంబంధాలూ అందులో వున్న వాళ్ళకి తెలుస్తాయి గాని ఒడ్డునున్న వారికేం తెలుస్తాయి? నా మాటవిని అల్లుడుగారు చెప్పినట్టు నడుచుకో సత్యా. ఊరికే ఉద్రేకపడి లేనిపోని లంపటాలు కొనితెచ్చుకోవద్దు" అని ముగించి లేచాడు తండ్రి.

సత్యబదులివ్వలేదు.

ఆమెలో ఓ ఆలోచన రూపుదిద్దుకుంది. ఓ ధీమా వెన్నుతట్టింది.

కౌన్సిల్ సమావేశపు ఎజెండాతో వచ్చాడు కమీషనర్. కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేర్చమంది సత్య. నీళ్ళు నమిలాడతను.

"నేను చెప్పినట్టు చెయ్యండి" అంది గట్టిగా.

పంపునీటిని శుద్ధిచేసి సరఫరా చేయుట, స్కూలు బాగుచేయించుట, కొన్ని పేటల్లో సిమెంట్ రోడ్లు, శివార్లలోని కాలనీల్లో పబ్లిక్ కొళాయిల ఏర్పాటు. పిల్లల పార్కు అభివృద్ధి. పొరుగూళ్ళ నుంచొచ్చే మహిళ కోసం బజారు సమీపాన మరుగుదొడ్ల నిర్మాణం - వగైరాలున్నాయామె సూచించిన కార్యక్రమాల్లో.

ఆమె ఆశించినట్లే మరో గంటలో వచ్చాడు రాజశేఖరం. "ఏవిటేవో చెత్తకార్యాలు చేబడతానన్నావుట" అడిగాడు గద్దింపుగా.

"అవును. చైర్‌పర్సన్‌గా అది నా కనీస కర్తవ్యం"

"ఏడ్చినట్టే వుంది నీ తెలివి! ఊరికే మున్సిపాలిటీ డబ్బు తగలెయ్యకు. ఆ డబ్బుతో బజార్లో షాపింగ్ కాంప్లెక్స్ కడదాం. మనకి బోలెడు లాభం"

"ఎలా?"

"రెట్టింపుకి ఎస్టిమేట్లు వేయిస్తాం. మనవాడి టెండరు ఖరారు చేయిస్తాం. సగానికి సగం మిగులు"

ఎంత దారుణం! ఎంత దోపిడి!

కాలేజీరోజుల్లో కమిటీవారూ ప్రిన్సిపాలూ కాలేజీ ఫండ్స్ తినేస్తున్నారని ఎంత రగడచేసింది.

అలాటిదిప్పుడు...ఆ స్పిరిట్ ఆ ధైర్యం ఏమైపోయాయి?!

కుటుంబసంబంధం నీరు కార్చేసిందా!

"సారీ. నేనొప్పుకోను"

"చచ్చినట్టు ఒప్పుకుని తీరాలి"

"ఒప్పుకోను"

"అదీ చూస్తాను"

"రేపటి పేపర్లో చూడండి"

"నా గురించి రాయిస్తావా? జనం నమ్ముతారనే?"

"చూద్దాం"

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు అన్ని పత్రికలకీ ఫోన్ చేసి చెప్పింది సత్య. కారణాలేమిటని తరచి అడిగినా చెప్పలేదామె.

పేపర్లోని వార్త చూసి అదిరిపడ్డాడు రాజశేఖరం. ఆమె ఇంతకి తెగిస్తుందనుకోలేదు. హైదరాబాదులో వున్న చంద్రలావు. "తొందరపడొద్దు. వచ్చేస్తున్నా" అంటూ ఫోన్ చేశారు.

కాంట్రాక్టర్లూ కమీషనరూ ఇతర ఉద్యోగులూ పరుగెత్తుకొచ్చారు. మధ్యలో మమ్మల్ని ముంచేస్తే ఎలా అని రాజశేఖరం దగ్గర గోలపెట్టారు. ప్రతిపక్షాలవారు చంకల కొట్టుకున్నారు. జనం అయోమయంగా చూశారు.

"ఇలాటి పిచ్చిపన్లు చెయ్యకు" అన్నాడు రాజశేఖరం.

"రెంటికీ న్యాయం చెయ్యలేకపోతున్నాను. అందుకే ఇల్లాలిగానే మిగిలిపోదామనుకుంటున్నాను" ధృఢ స్వరంతో అంది సత్య.

"ఇప్పుడు నీ కొచ్చిన కష్టమేమిటసలు? పట్టుచీర కట్టుకుని సభలకీ సమావేశాలకీ వెళ్తూ హాయిగా వుండక పుస్తకాల కబుర్లు పట్టుకుని వూరేగుతావెందుకు?"

"జనం ఎన్నుకున్న నాయకురాల్ని గనుక"

"నువ్వు రిజైన్ చేస్తే మళ్ళీ మన పార్టీ కేండిడేట్ గెలవరు తెలుసా?"

"అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడమే తప్ప అభివృద్ధి పనులేం చెయ్యనప్పుడు ఎలా గెలిపిస్తారు?"

"అంటే మన అధికారం మన పరువూ రాబడీ అన్నీ పోయినా సరే రిజైన్ చేసేస్తానంటావా"

"తోలుబొమ్మని కాదు కదా. అందుకే అలాటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది"

"అబ్బో రక్తమాంసాలున్న బొమ్మ బయల్దేరిందండి. మొగుడిమాట ఖాతరు చెయ్యదు గాని ఊరిని ఉద్ధరిస్తుందిట!" అరిచినట్టుగా అన్నాడు.

"మీరెన్ని చెప్పినా తిట్టినా సరే నా నిర్ణయం మారదు. నా కిష్టం లేని పాత్ర నేను ధరించలేను. దట్సాల్"

బిత్తరపోయాడు రాజశేఖరం.

"మా కాలంలో మొగుడికి ఎదురు చెప్పి ఎరగం. మాయదారికాలం మాయదారి బుద్ధులూనూ!" అంది చేతులు తిప్పుతూ అత్తగారు.

"కాలం ఎప్పుడో మారిందత్తయ్యా. మారాల్సింది కొందరు మనుషులే"

అవాక్కయ్యిందామె.

సత్య రాజీనామాకి కారణమేమిటో బోధపడక రకరకాల ఊహాగానాలు ఊపిరిపోసుకున్నాయి. భర్త, మావగార్ల అవినీతి పనులకి తలొగ్గలేక రాజీనామా చేస్తోందన్న ఊహ బలం పుంజుకుంది. జనంలో సత్య మీద గౌరవాభిమానాలు అమాంతం పెరిగిపోయాయి.

ఎందరో గుంపులు గుంపులుగా తరలివచ్చారు. రాజీనామా చెయ్యొద్దంటూ చేతులు పట్టుకుని అర్థించారు. ఆమె మీద కొండంత ఆశపెట్టుకున్నామన్నారు. ఇంటిని చక్కదిద్దే ఇల్లాలే ఇలనీ చక్కదిద్దగలదన్నారు.

అంతా అన్నీ మౌనంగా వింటూండి పోయింది సత్య.

చంచల్రావొచ్చారు. పరిస్థితి గబగబా అంచనా వేశారు. రాజకీయంగా సత్య ఉచ్ఛదశలో వుంది. ఆమెకి ఇంకా పేరొస్తే ఆ పేరుతో తను మళ్ళీ యమ్మెల్యే కావచ్చనుకున్నారు. ఇప్పుడామె పదవి వదిలేస్తే తమ చేతుల్లో ఎలాటి అధికారమూ వుండదు. మళ్ళీ ఎన్నికలనాటికి ఎవరెవరో ఎవరికి తెలుసు?!

"నా ఆటలింకసాగవా?" అని గింజుకుంటున్న కొడుక్కి నచ్చ చెప్పేక కోడలితో అన్నారు -

"నువ్వు రాజీనామా చెయ్యక్కర్లేదు సత్యా. ఇక నేను గాని అబ్బాయిగాని నీ దారికి అడ్డు రాము. నీకేది మంచి అన్పిస్తే అది చెయ్యి. ఎలా మంచిదన్పిస్తే అలా పాలించు. నువ్వేమిటో నీ సత్తా ఏమిటో రుజువు చేసుకో"

మహదానందపడింది సత్య.

ఒకనాటి ఉత్తేజం మళ్ళీ వచ్చి చేరగా హుందాగా ధీమాగా స్వేచ్ఛగా మున్సిపల్ ఆఫీసుకి బయల్దేరింది.

ఇప్పుడే కొత్తగా గెలిచి వస్తున్నట్టు ఎంతో సంబరంగా వుంది. అవును మరి. ఇప్పుడు గెలిచింది ప్రతిపక్షపు అభ్యర్థి మీదకాదు స్వపక్షపు స్వార్థం మీద!

సత్యపాలనకి శ్రీకారం చుట్టింది సత్య.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)

**3.6.1998**